క్లుప్తంగా

టీబీ రాకుండా వ్యాక్సిన్



వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

రాపూరు: టీబీ రాకుండా ప్రభుత్వం అందిస్తున్న వ్యాక్సిన్‌ను 18 సంవత్సరాల పైబడి 60 సంవత్సరాలలోపు వారు వేయించుకోవాలిని ప్రభుత్వ వైద్యురాలు సుదర్శనమ్మ అన్నారు. రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో బీసీజీ వ్యాక్సిన్ వేసే ప్రకియ గురువారం నుంచి ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్‌యానిట్ అధికారి వెంకటేశ్వరావు, వైద్యసిబ్బంది రసూల్, శ్రీనివాసులరెడ్డి, కాంతమ్మ, హరితమ్మ, సురేఖ పాల్గొన్నారు.

నాయుడుపేటలో కుండపోత వర్షం



వెల్‌కం సెంటర్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నాయుడుపేటటౌన్: పట్టణంలో ఉదయం నుంచి మేఘాలు దట్టంగా కమ్ముకుని చల్లటి వాతావారణం నెలకొంది. ఉదయం 11 గంటల సమయంలో గంటపాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో పట్టణంలో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి మున్సిపల్ సిబ్బందితో పనులు చేసి వర్షం నీరు డ్రైనేజీ కాలువల్లో వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఎండ తీవ్రత లేకుండా చల్లటి వాతావారణం నెలకొనడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.


వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

నాయుడుపేటటౌన్: తుమ్మూరు గ్రామంలో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు కొలువై ఉన్న గర్భాలయాల గోడలను శుద్ధిచేసి సుగంధ ద్రవ్యాలతో లేపనం చేశారు. ఆలయం వద్ద తెల్లవారుజామునే సుప్రభాత సేవ జరిపి ఆరాధన, సహస్రనామార్చన, బలి హరణం, మంగళస్నాన పూజలు చేశారు. అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, తిరుచూర్ణంతో కలిపిన మిశ్రమ ద్రవ్యాలను ఆలయం గోడలకు లేపనం చేశారు. సాయంత్రం సర్వదర్శనం, రాత్రి స్వామివార్ల ఏకాంత సేవ పూజలను నిర్వహించారు. ఈనెల 20 తేదీ నుంచి 30 తేదీ వరకు ఆలయ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు హరిరెడ్డి, సుధీర్ ఈసందర్భంగా తెలిపారు.

కూలి గిట్టుబాటు నగదు అందేలా పనులు



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

దక్కిలి: ఉపాధి హామీ పథకం కూలి గిట్టుబాటు నగదు అందేలా పనులు చేయాలని ఏపీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని అల్తూరుపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గరువారం ఆయన పరిశీలించారు. ఏపీఓ కూలీలతో మాట్లాడుతూ గ్రామంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ 100 రోజులు పనిదినాలు కల్పిస్తామన్నారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కూలీల హాజరును పరిశీలించారు.

వైజేపీ లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



మనోజ్‌కుమార్‌ను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

గూడూరు రూరల్: 2024–25 సంవత్సరానికిగాను వైజేపీ లయన్స్‌క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలోని ఆడిటోరియంలో గురువారం వైజేపీ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పి.వి.మనోజ్‌కుమార్, గూడూరు టౌన్ క్లబ్‌కు సుబ్రమణ్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌వీ రావు, వేణురెడ్డి, మురళిరాజు, వెంకటరామిరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, ఎల్‌ఎన్‌ఎన్ స్వామి, ప్రసాద్, రాజేంద్రప్రసాద్, శివరాం, బండ్ల సుధాకర్, హరికృష్ణ, శ్రీను, మురళినాయుడు, గురునాథం, బషీర్ పాల్గొన్నారు.

విజయంపై ఎవరి ధీమా వారిదే!

- వెంకటగిరిలో పెరిగిన ఓటింగ్ శాతం
- పోలింగ్‌కు పోటెత్తిన నారీమణులు
- ఎవరు గెలుస్తారోనని ప్రజల్లో చర్చ



క్యూ కట్టిన మహిళ ఓటర్లు (ఫైల్)

వెంకటగిరి(సైదాపురం): సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. గత ఎన్నికల్లో ఎప్పుడూ లేనివిధంగా ఈ పర్యాయం ఓటింగ్‌కు మహిళలు పోటెత్తినట్టు పోలైన ఓట్లు చెప్పకనే చెప్పాయి. దీనిని బట్టి చూస్తే ఎన్నికల బరిలో తలపడిన అభ్యర్థుల తలరాతలను మార్చే శక్తి నారీమణుల చేతుల్లోనే ఉందని స్పష్టమవుతోంది. గెలుపు నిర్దేశకులు తామేనని మహిళలు పరోక్షంగా చాటిచెప్పినట్టైంది. అయితే మహిళలు ఏ పార్టీవైపు మొగ్గు చూపారన్నదే ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. ఎన్నికల్లో ప్రధానంగా అధికార వైఎస్సార్ సీపీ, ప్రతిపక్ష టీడీపీ అభ్యర్థుల నడుమే పోటీ సాగింది. ఇక, ఆయా నియోజకవర్గాల్లో గెలుపెవరిదో? అని పలు చానళ్ల రాజకీయ విశ్లేషణలు ప్రసారం చేశాయి. అలాగే సోషల్ మీడియాలో సైతం గెలుపు–ఓటములపై ఎవరికి వారు అనుకూలంగా హోరెత్తించారు. ఈ పోల్స్‌తో గెలుపు తమదేనని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల ఫలితాలకు మరో 18రోజులు గడువుంది. అయితే ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే చర్చ జోరుగా ప్రజల్లో నడుస్తోంది.

ఓటర్ల తీర్పు ఎవరి వైపు?

స్థానిక సాధారణ ఎన్నికల్లో ప్రజలు తమకు మరింత మేలు చేసే ప్రభుత్వమే రావాలని కోరుకోవడం పరిపాటి. ఈపర్యాయం ఎన్నికలు ఉత్కంఠ రేపాయి. ఒంటరిగా ఒక వైపు వైఎస్సార్‌సీపీ, మరో వైపు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా బరిలో దిగడంతో ఎన్నికల వేడిని పెంచింది. తమ మేనిఫెస్టోలను ప్రకటించి ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేశాయి. అయితే మేనిఫెస్టో హామీలను ప్రజల్లోకి ఏపార్టీ బలంగా తీసుకెళ్లింది? ఎవరు ఏ మేనిఫెస్టో హామీలను నమ్ముతున్నారు? దేనిని నమ్మడం లేదు? అనేది ఎన్నికల ముందు చర్చకు తావిచ్చింది. ఒక పార్టీ మేనిఫెస్టో విశ్వసనీయతతో కూడుకుని ఉందని, మరొకరిది ఓట్లను దండుకోవాలనే ఉద్దేశంతో ఇచ్చిన బూటకపు హామీలని పెదవి విరిచిన ఓటర్లూ లేకపోలేదు. ప్రజల నాడి చూస్తే తమకు అన్ని విధాలా మేలు చేసే ప్రభుత్వమే కావాలని, చెప్పినవన్నీ నెరవేర్చే నాయకుడే సీఎంగా ఉండాలని బలంగా కోరుకుంటున్నట్లు తేలింది. నియోజక వర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఈ పర్యాయం పెద్ద సంఖ్యలో బారులు తీరిన ఓటర్లు కనిపించడం అటు అన్ని పార్టీల నాయకులను ఆశ్చర్యపరిచింది. ప్రత్యేకించి మహిళలు పోటెత్తారు. వృద్ధులు, సామాజిక పింఛను దారులు సైతం పెద్ద సంఖ్యలో వచ్చారు. అలాగే చంటి బిడ్డలతో సైతం తల్లులు రావడం పలువురినీ ఆకర్షించింది. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందారు కాబట్టే ఈస్థాయిలో పోలింగ్‌కు వచ్చారని అధికార నాయకులు లెక్కలేసుకున్నారు. ఇదంతా ప్రభుత్వ వ్యతిరేకత వల్లేనంటూ టీడీపీ శ్రేణులు మరోవైపు చెప్పుకొచ్చాయి. ఇక 2019లో 78 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగి 80.87 శాతం నమోదు కావడంతో రాజకీయ విశ్లేషకులు ఇది ఎవరికి అనుకూలిస్తుంది? ఎవరికి నష్టం కలిగిస్తుందో అంచనా వేసే పనిలో పడ్డారు.

> **లక్ష ఓట్లే కీలకమా?**
> వెంకటగిరి నియోజకవర్గంలో యాదవులు 40వేలు, రెడ్డి 30వేలు ఎస్సీ (అరుంధతీయ)35వేలు మొత్తం లక్షా 5వేల ఓట్లలో అధిక శాతం ఏపార్టీకి అనుకూలిస్తే వారిదే విజయం అనే వాదన అప్పుడే మొదలైంది.

వెంకటగిరి నియోజకవర్గ ప్రొఫైల్

మొత్తం ఓటర్లు	పురుషులు
2,43,582	1,18,888
మహిళలు	**ఇతరులు**
1,24,690	4
పోలైన ఓట్లు	**శాతం**
1,96,986	80.87

ఏఏ మండలంలో ఎంతెంత...?

మొదటి నుంచి టీడీపీకి కంచుకోటగా ఉన్న వెంకటగిరి గత ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి మెజారిటీనిచ్చింది. మొదటి నుంచి కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు వైఎస్సార్‌సీపీకి కంచుకోటగానే ఉన్నాయి. ఈ పర్యాయం ఎన్నికల్లోనూ ఆ మండలాల్లో ఓటర్లు తమ పార్టీకే ఎక్కువ మొగ్గు చూపారని అధికార పక్ష నేతలు పేర్కొంటున్నారు. అయితే ఓటర్లు మాత్రం పెదవి విప్పడం లేదు. సంక్షేమానికే ఓటర్లు పట్టం కట్టనున్నారని అధికారపక్షం ..వ్యతిరేకతతో తమ వైపు మొగ్గు చూపుతారని ప్రతిపక్షం ఎవరికి అనుకూలంగా వారు చెప్పుకుంటున్నాయి. కొన్నిచోట్ల పందేలు సైతం కట్టినట్టు తెలియవచ్చింది. ఏది ఎలా ఉన్నప్పటికీ వచ్చే నెల 4వ తేదీ వరకు ఎవరి లెక్కలు వారివే..గెలుపుపై ఎవరి ధీమా వారిదే అంతే మరి!

మూడు గ్రామాల్లో పోలీస్ పికెట్

పెళ్లకూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివాదాస్పద గ్రామాల్లో చోటుచేసుకున్న చెదురుమదురు ఘటనలతో పెళ్లకూరు, రావులపాడు, చిల్లకూరు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడడం కోసం గట్టి చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల సమయంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదాలతో పెళ్లకూరు, రావులపాడు, చిల్లకూరు గ్రామాల్లో ఉద్రిక్తత వాతావరణం నెలకుంది. దీంతె పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు వాసవీ అమ్మవారి జయంతి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాన్ని శుక్రవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు

కండలేరులో 6.774 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 6.774 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తుల కొంగుబంగారం కరిమాణిక్యస్వామి

- 20 నుంచి బ్రహ్మోత్సవాలు
- టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు





శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామివారు, ఆలయ ప్రధాన గోపుర శిఖరం

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని తుమ్మూరు గ్రామంలో వందల సంవత్సరాల నాటి ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి వారి ఆలయం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ఎన్నో ఏళ్లుగా ఈ ఆలయ బ్రహ్మోత్సవాలను క్రమం తప్పకుండా దేవదాయ శాఖ అధికారులు ఘనంగా నిర్వహిస్తువచ్చారు. 2017 మార్చి 15న కరిమాణిక్యస్వామి ఆలయంతో పాటు పక్కనే ఉన్న గంగా కామాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామి వారి ఆలయాలను టీటీడీలో విలీనం చేశారు. అప్పటి నుంచి తుమ్మూరులో స్వామివార్ల బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో 7వ రోజు నిర్వహించే స్వామివార్ల కల్యాణోత్సవం, 8వ రోజున జరిగే రథోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తుంటారు.

ఆలయ పురాణం..

తుంబురుడు, నారదుడు కలిసి కంచి వరదరాజ స్వామిని దర్శించుకునేందుకు వెళ్తూ స్వర్ణముఖి నదికి ఉత్తరవాహినిగల తుమ్మూరు క్షేత్ర ప్రసిద్ధిని తిలకించి దేవాలయంలో ఉన్న అశ్వర్థ వృక్షం కింద తపస్సు ప్రారంభించారు. దీంతో వరదరాజస్వామి గరుడవాహన దారుడై వారిరువురికి దర్శనమివ్వడంతో వారు అక్కడ స్వామివారిని ప్రతిష్ఠించినట్లు పురాణం చెబుతోంది. దీంతో తుమ్మూరు, కంచిలో జరిగే గరుడోత్సవాలు ఒకే రోజున జరుగుతున్న ఆచారం నేటికీ కొనసాగుతోంది.

బ్రహ్మోత్సవాల వివరాలు..

టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 20 తేదీ సోమవారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 21న ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహనసేవ, 22న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి హనుమంత సేవ, 23న ఉదయం ద్వారదర్శనం, రాత్రి గరుడసేవ, 24న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి హంసవాహనం, 25న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి విమానోత్సవం, 26 ఉదయం తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం మోహినీ అవతారం, సింహ, గజ వాహన సేవలు, రాత్రి కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 27న ఉదయం రథోత్సవం, రాత్రి తిరుచ్చి ఉత్సవం, 28 ఉదయం చప్పరోత్సవం, రాత్రి పార్వేట ఉత్సవం, 29 ఉదయం చక్రస్నానం, వసంతోత్సవం, రాత్రి ధ్వజావరోహణం, 30 ఉదయం స్వామి వార్లకు అభిషేకం, సాయంత్రం పుష్పయాగ పూజలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. టీటీడీ కార్యనిర్వాహణాధికారి ఏవీ ధర్మారెడ్డి సారథ్యంలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దేవుని కృపకు పాత్రులు కావాలని టీటీడీ అధికారులు హరిరెడ్డి, సుధీర్ కోరారు. తుమ్మూరు ఎస్‌కేబీబీఎస్ సత్రంలో బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ స్థానిక దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమారాధన జరుగుతుందని స్థానిక దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారి శశాంక్ తెలిపారు.

ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చిల్లకూరు: మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల పరిషత్ అధ్యక్షురాలు తుపాకుల వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఆర్థిక పరమైన అంశాలపై ఎలాంటి తీర్మానాలు చేయక పోయినప్పటికీ పలు శాఖల మధ్య సమన్వయలోపం వల్ల ఆయా పంచాయతీలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పంచాయతీలలో వీధి లైట్ల నిర్వహణ భారంగా మారుతుందని దీని నివారించేందుకు పలుమార్లు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించినా ఏమి పట్టించుకోవడం లేదని పంచాయతీ పాలకులు, కార్యదర్శులు తెలిపారు. అలాగే తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి అందుబాటులో ఉండేలా ఇంటర్ తరగతులు గత ఏడాది నుంచి నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతివిషయాన్ని మరోసారి జరిగే సమావేశంలోపు పరిష్కరించేలా చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, తహసీల్దార్ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ పోలుబోయిన చెంగయ్య, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సాగులో అన్నదాతలు బిజీబిజీ



దుక్కి చేస్తున్న అన్నదాత



సాగులో బిజీ బిజీగా రైతులు

వాకాడు: గత ఐదేళ్లుగా వ్యవసాయంలో ప్రకృతి అనుకూలించడం, అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలవడం, వెరసి మండలంలోని రైతులు ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. గత ఐదేళ్ల కిందట రైతులు అష్టకష్టాలు పడి ఏడాదికి ఒక పంట మాత్రమే పండించేవారు. ఇప్పుడు ఎడగారు సీజన్ సైతం రైతులు పూర్తి విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. మండలంలో 15 వేల ఎకరాలు పంట పొలాలు ఉన్నాయి. అందులో ఇప్పటికే 9 వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. మరో 4 వేల ఎకరాల్లో దుక్కిలు సిద్ధం చేస్తున్నారు. దీంతో అన్నదాతలు సాగులో బిజీబిజీగా ఉన్నారు. ఇది మే నెల ఆపై రోహిణి కార్తె భగ్గుమన్న ఎండలు సైతం తగ్గి నల్లని మేఘాలతో వాతావరణం చల్లబడడంతో అన్నదాతలు సాగులో మరింత ఊపందుకున్నారు. ఒకప్పుడు సాగు నీటి కొరతతో ఏడాదిలో ఒకే పంటకే రైతులు పరిమితమయ్యేవారు. గత ఐదేళ్లుగా ఏడాదిలో మూడు పంటలు పండించడం విశేషం. ఏడాదిలో రెండుసార్లు వరి పంట, మధ్యలో చిరుధాన్యపు పంటలను పండిస్తున్నారు. దీంతో రైతులు ప్రతి ఏటా ధీమాగా మూడు పంటలను పూర్తి విస్తీర్ణంలో సాగు చేసేందుకు పూనుకున్నారు. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు, సబ్సిడీతో అందించడంతోపాటు ప్రతి సారి సాగు ప్రారంభంలోనే రైతు భరోసా పథకం ద్వారా ఆర్థికసాయం అందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వాకాడు, కాశీపురం, గొల్లపాళెం, ముట్టెంబాక, నెల్లిపూడి, కల్లూరు, కొండాపురం, రావిగుంటపాళెం గ్రామాల్లో రైతులు సాగులో నిమగ్నమయ్యారు.

బండవేషాలతో భక్తుల కేరింత



తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా రెండోరోజు గురువారం భక్తులు బండ వేషాలు ధరించి నగరంలో కేరింతలు కొట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు సందడి చేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు కుటుంబ సమేతంగా ఆలయం వద్ద పొంగళ్లు పెట్టారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు చేశారు. జాతర రెండవ రోజున తాతయ్యగుంట గంగమ్మ బండవేషధారణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు తోటి వేషం

తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం తోటి వేషాలతో గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. శరీరానికి బొగ్గుపొడి రాసుకుని తెల్లనామం, కనుబొమలపై చుక్క బొట్లు పెట్టుకుంటారు. పిల్లలు మీసాలను కూడా పెట్టుకుంటారు. తలకు రిబ్బన్లు, నడుముకు వేపాకు ధరిస్తారు. పాత పొరకలు, చాట చేతపట్టుకుని ఎదురుపడిన వారిని తిన్నగా మోదుతూ ఊరేగుతారు. బూతు పాటలు పాడతారు. అనంతరం గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారి పాదాల వద్ద వేపాకు, చాట, పొరకలు పడేసి బూతులు తిడుతూ కేరింతలతో సందడి చేస్తూ భక్తి పూర్వంగా మొక్కులు చెల్లించుకుంటారు.

జాగ్రత్తలు పాటిస్తే డెంగీ దూరం



దొరవారిసత్రంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



పెళ్లకూరులో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

దొరవారిసత్రం: జాగ్రత్తలు తీసుకుంటే డెంగీ వ్యాధి సోకదని డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య అన్నారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, అధికారులు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ చంద్రకళ, సూపర్‌వైజర్స్ గోపికిరణ్, మైథిలి, మలేరియా అధికారి రమేష్‌బాబుపాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా తేలికపాటి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డెంగీ నుంచి రక్షణ పొందవచ్చని పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుజాత అన్నారు. గురువారం డెంగీ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు డెంగీపై అవగాహన కల్పించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: డెంగీని నివారించేందుకు ప్రతిఒక్కరూ నడుము కట్టాలని చిల్లకూరు, వరగలి పీహెచ్‌సీల వైద్యులు తేజస్విని, గీతామణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఆరోగ్య విస్తరణాధికారులు ముజీఫ్, హజరతయ్య, సూపర్‌వైజర్ రవి, సీడీపీఓ మహబూబీ, సూపర్‌వైజర్ రేణుక పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: అత్తివరం ఆరోగ్యకేంద్రంలో జాతీయ డెంగీ నివారణ ర్యాలీని వైద్యసిబ్బంది గురువారం నిర్వహించారు. వైద్యాధికారి మోహన్‌రంగా, సిబ్బంది సుభాషిణి, రాధిక, యామిని, నిరోషా, కుసుమకుమారి, సునంద, అరుణ పాల్గొన్నారు.



చిల్లకూరులో వైద్య సిబ్బంది ర్యాలీ



అత్తివరంలో వైద్యసిబ్బంది ర్యాలీ

నిలువెత్తు పచ్చని ఫౌంటేన్



పచ్చని ఫౌంటేన్ తాటిచెట్టు

చిల్లకూరు: తమ్మినపట్నం గ్రామానికి వెళ్లే వారు రోడ్డు పక్కనే ఉన్న నిలువెత్తు తాటి చెట్టును కొద్దిసేపు ఆగి చూసి వెళుతున్నారు. ఎందుకంటే తాటి చెట్టుకు పిచ్చ తీగలు పూర్తిగా అల్లుకుపోయి నిలువెత్తు పచ్చని ఫౌంటేన్‌లా కనిపిస్తూ అందరిని ఆకట్టుకుంటోంది. కొన్ని నెలలు పాటు తీగలు అల్లుకుంటేగానీ ఇలా చెట్టు మొత్తం కనిపించకుండా అల్లుకోలేవని, అయితే పొలం యజమాని కూడా చెట్టు పచ్చగా కనివిందు చేస్తుంటే అలాగే వదలి వేశాడని తెలిపారు. ఏది ఏమైనా అటు వైపు వెళ్లే వారికి ఈ పచ్చని ఫౌంటేన్ కనువిందుచేస్తోంది.